కథ

# భామా విజయం

బ్రతకడం కోసం తిండిగానీ, తిండికోసం బ్రతక్కూడదు అని చాలామంది అంటారు గానీ నేను ఏకీభవించను. మానవ శరీరం కోరే ముఖ్యానుభూతుల్లో తిండి ఒకటి. మాట్లాడడంకంటే రుచుల అనుభూతి కోసమే దేవుడు మనిషికి నాలుకనిచ్చాడు. అందుకే మాటలురాని పశువులకూ నాలుక వుంది, మంచి రుచులను ఆస్వాదించడానికి, ఆ రుచులను అందించినవారిని పొగడ్డానికీ మనిషికి నాలుక వుంది. ఆ నాలుకకు ఆగకుండా పని చెప్పగలిగేటంత గొప్ప మనిషి నా అమ్మ.

అమ్మ నాకు షడ్రుచులూ అలవాటు చేసింది. అందుకని నేనెప్పుడూ అమ్మ చుట్టూ తిరుగుతుండేవాడిని. అమ్మకు అన్ని పనుల్లో సాయం చేసేవాడిని. అమ్మమీద ఈగ కూడా వాలనిచ్చేవాడిని కాదు.

నేను తిండిపోతునుకాను, రుచికరమైన ఆహారంకోసం తపిస్తాను. నా అభిరుచికి తగ్గ ఆహారం ఇంట్లో తప్ప మరెక్కడా నాకు దొరికేదికాదు. అందుకని హోటళ్ళు, రోడ్డు ప్రక్క బండ్లూ నన్నాకర్షించేవి కావు. ఏదో సమయంలో ఏదో ఒకటి అల్పంగానో, అనల్పంగానో అమ్మ నాకు అందిస్తూనే వుంటుందని ఎక్కువగా ఇంటిపట్టునే వుండేవాడ్ని. అమ్మ నాకు మరీ ఎక్కువ పనులు చెప్పదు కాబట్టి తీరుబడి వున్నప్పుడల్లా చదువుకునేవాడ్ని. అలా చదువుపట్ల నాకు అభిరుచి కలిగింది.

బాగా చదువుకున్నాను. ఏ పరీక్షలైనా బాగా రాసేవాడ్ని. అలా పాతికేళ్ళు నిండకుండానే ఎంట్రెన్సు టెస్టుల ధర్మమా అని నాకు మంచి ఉద్యోగం వచ్చింది.

నాకు మంచి ఉద్యోగం వచ్చినందుకు అమ్మ, నాన్న, ఇద్దరక్కలు, బామ్మ, ఇద్దరు బాబాయిలు ఎంతో సంతోషించారు. నేనూ సంతోషించాను.

కానీ అమ్మ నాతో ఉండదనే బెంగ. నా ఉద్యోగం మా ఊరికి నూరు కిలోమీటర్ల దూరం.

''నువ్వు లేకుండా ఎలా అమ్మా?'' అన్నాను వెళ్ళే ముందు.

అమ్మ నవ్వి ''ఇప్పుడు నీక్కావాల్సింది అమ్మకాదు, పెళ్లాం'' అంది.

అవునని నాకూ తెలుసు.

ఓ అందమైన అమ్మాయి పొందుకోసం నా శరీరం తపిస్తోంది. అయితే ఆ అమ్మాయి అమ్మంత రుచిగా వంట కూడా చేసి పెట్టాలని నా కోరిక.

ఉద్యోగంలో చేరగానే నాకు అమ్మలేని లోటు బాగా తెలిసొచ్చింది.

బయట తిరిగే అలవాటు లేని కారణంగా ఒంటరితనం బాగా ఫీలవుతున్నాను. అలా ఆర్నెల్లు జరిగేసరికి చిక్కి సగమయ్యాను. మధ్యలో ఇంటికి వెళ్లినప్పుడు అమ్మ నా పరిస్థితిని చూసి ఇక లాభంలేదని త్వరగా పెళ్లి చేసేయాలని అంది.

నాకు పెళ్లిచూపులు మొదలయ్యాయి. వంటొచ్చిన పిల్లకి చదువురాదు, చదువొచ్చిన పిల్లకి వంట రాదు. రెండూ వచ్చిన పిల్ల అనాకారో, అహంకారో, కుసంస్కారో అవుతుంది. వీటన్నింటికీ వెనుక అమ్మానాన్నల డబ్బాశ కూడా వుంది.

మొత్తం పదహారు సంబంధాలు చూసాక అమ్మానాన్నలు సుజాత విషయంలో సరిపెట్టుకున్నారు. సరిపెట్టుకోవడమెందుకంటే కట్నం ఆశించిన మేరకు రాలేదు. లాంఛనాలు తృప్తికరంగా లేవు. పిల్లకు బంగారం కూడా తక్కువ. లేకుంటే పిల్ల అందమైనది, చురుకైనది, తెలివైనది. డిగ్రీ పాసయింది.

నాకు సుజాతతో పెళ్లయింది. కాపురమూ ప్రారంభమయింది. 'పెళ్ళయిందని పెళ్లాం కొంగు పట్టుకుని తిరుగుతూ మమ్మల్నందర్నీ మర్చిపోకు'' అని ఇంట్లోని ప్రతి ఒక్కరూ నాతో అన్నారు. ఆ మాటలు అనుక్షణం నా చెవుల్లో గింగిరుమంటూనే వుంటాయి.

సుజాత నాకు సంతోషాన్నిస్తూ నా సంతోషానికే కృషి చేస్తుందని నాకు తెలుసు. అయితే నా వాళ్ళందరి నుంచీ నన్ను వేరు చెయ్యడానికి వచ్చిన మనిషిగా కూడా ఆమె నాకు కనిపిస్తూండడంవల్ల నేనామెతో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ వుండేవాడ్ని.

సుజాత వంటలు బాగానే చేసేదిగానీ ఆమెకు అమ్మకున్నంత శ్రద్ధలేదు. అమ్మ ఇడ్లీ చేస్తే దాంట్లోకి కొబ్బరిచట్నీ, అల్లం చట్నీ, కారప్పొడి...మూడూ వుండాల్సిందే.

సుజాత ఏదో ఒకటే చేస్తుంది. అమ్మ చేస్తే రోజూ అన్నంలోకి పప్పు, కూర, పచ్చడి, పులుసు, పెరుగు ఉండాల్సిందే. పప్పులో నంజుకుందుకు నిమ్మకాయ కారమో, చల్ల మిరపకాయలో, మామిడల్లం ముక్కలో చేస్తూండేది. పులుసులోకి అప్పడాలో, వడియాలో వేయించి వుంచేది. ప్రొద్దుటి ఐటమ్స్ రాత్రికుండవు. ఈరోజు తిన్న ఐటమ్ రిపీట్ కావడానికి కనీసం పదిరోజులు పట్టేది.

సుజాత ఇందుకు పూర్తిగా భిన్నం. ఉప్మావంటి టిఫినుకు చట్నీ ఎందుకూ అంటుంది. వంట రెండుపూటలకూ చేస్తానంటుంది. అధరువులు అన్నేసి చేస్తే దుబారా అంటుంది.

నేను మగాణ్ణి. ఆమె మాటల్లో తర్కముంటుందని నాకు తోచదు. ప్రతిఘటన మాత్రం కనబడుతుంది.

''అంటే అమ్మకు పొదుపు లేదంటావా?'' అన్నానో రోజున.

''అదంతా నాకు తెలియదు. మా నాన్నకు ముగ్గురాడపిల్లలు. నేను రెండోదాన్ని. మీ నాన్నగారితో పోలిస్తే ఆయనకు జీతం బాగా తక్కువ. బాధ్యతలెక్కువ. ఆస్తులు లేవు. అయినా ఆయన ఇంతవరకూ ఎక్కడా పైసా అప్పు చేయలేదు. ఎవరినీ దేహీ అని యాచించలేదు'' అంది సుజాత.

అమ్మ డబ్బుకోసం అప్పుడప్పుడు నాకు ఉత్తరాలు వ్రాస్తుంటుంది. నేను పంపుతుంటాను. సుజాత అమ్మనుద్దేశించే ఆ మాటలన్నదని నాకు అర్థమై ''నాకు చాలా పెద్ద కట్నంతో ఆఫర్లు వచ్చాయి. ఆ లెవెల్లో కట్నం అడిగితే మీ నాన్న అప్పులు చేసేవాడు'' అన్నాను.

''నాన్న అందని పండ్లకు అర్రులుచాచే టైపుకాదు'' అంది సుజాత.

నేనేమన్నా సుజాత వద్ద సమాధానమున్నదని నాకు తొందరగానే తెలిసిపోయింది.

నన్ను నావాళ్ళనుంచి వేరు చేస్తోందని నేనంటే- తనే తన వాళ్లనుంచి వేరుపడి వచ్చానని ఆమె అంది.

అమ్మ వంటలు బాగా చేస్తుందని నేనంటే-వంటకు రుచి ముఖ్యమనీ, అయిటమ్స్ సంఖ్య కాదని తానంది. కట్నం తక్కువ తీసుకోవడం ఉదారభావమంటే అసలు కట్నం తీసుకోవడమే తప్పంది. సుజాతకు నిలువెల్లా స్వార్థమని నేనంటే తన స్వార్థం తనకోసం కాదని, భర్త కోసమనీ సహేతుకంగా చెప్పింది.

నేనిక తర్కాన్ని పక్కనపెట్టి ''సంపాదించే వాణ్ణి నేను. నువ్వు నేను చెప్పినట్లు చేయాల్సిందే'' అన్నాను.

''సంపాదించకపోవడంవల్ల నాకీ ఇంట్లో స్వేచ్ఛ లేదంటే ఈ క్షణం నుంచే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తాను'' అంది సుజాత.

ఆమె ఉద్యోగం చేయడం నాకు ప్రమాదమనిపించింది. అప్పుడు సమాన హక్కులంటూ ఆమె నాచేత వంట చేయించగలదు, బట్టలుతికించగలదు.

నేను సుజాత ఉద్యోగం చేయడానికి ఒప్పుకోలేదు.

అప్పుడు సుజాత నన్ను మిక్సీ కొనమంది. మిక్సీ అంటే మామూలు మిక్సీ కాదు. అది కూరలు తరుగుతుంది. కొబ్బరి కోరుతుంది. ఫలరసాలు తీస్తుంది. పూరీలకు పిండి కలుపుతుంది. బియ్యం నుంచి నూకనూ, పిండినీ కూడా

తయారుచేస్తుంది. మామూలు మిక్సీ చేసేవాటికి ఇవన్నీ అదనం.

''అలాంటి మిక్సీ లేకుండా నేను మీకు కోరిన విధంగా వంటలు చేయలేను'' అంది సుజాత.

''మిక్సీలో వంటలు రుచిగా రావు. పిండి రుబ్బాలి. పచ్చళ్ళు చేయాలి. పొడులు దంచాలి. అప్పుడే వంట రుచి'' అన్నాను.

''అసలు వంట పొయ్యిమీద చేయాలి. గ్యాస్‌స్టవ్ మీద వండితే రుచి వుండదు. అయినా నేను పొయ్యి దగ్గరకు వెళ్ళలేను'' అంది సుజాత.

సుజాత ఆ మాట ఎందుకన్నదో నాకు తెలుసు. అమ్మ నాకు తెలిసినప్పటినుంచీ గ్యాస్ పొయ్యిమీదే వండుతుంది. మూడేళ్ల నుంచి అమ్మ మిక్సీ కూడా వాడుతోంది. అయితే కేవలం పొడి గుండల కోసమే మిక్సీని ఉపయోగిస్తుంది. దాని ఖరీదు వెయ్యికి లోపే. సుజాత అడిగే మిక్సీ ఖరీదు ఆరువేలకు తక్కువుండదు.

నేను అమ్మకు ఉత్తరం వ్రాశాను. తిరుగుటపాలో అమ్మ నా సమస్యను పరిష్కరించింది. సుజాత మిక్సీ కొనుక్కోవచ్చునంది కానీ వాళ్ల నాన్ననడిగి కొనుక్కోమంది.

అది ఇంచుమించు ఆజ్ఞ!

''ఈ ఇల్లు మనది. మనికిష్టమైనవి మనం కొనుక్కుంటాం. వద్దనడానికి ఆవిడెవరు?'' కాస్త తీవ్రంగానే అడిగింది సుజాత.

''ఆవిడ వద్దనలేదు'' అన్నాను ఆ తీవ్రతకు కాస్త జడిసి.

'' మా నాన్నను అడగమనడానికి ఆవిడెవరు?'' మళ్ళీ అంది సుజాత.

''ఆవిడ మా అమ్మ!''

''అమ్మయితే తనక్కావలసిందడిగి తీసుకోమనండి. కాదన్నదెవరు?''

ఏమనాలో నాకు తోచలేదు. కానీ ''నీకు మిక్సీ కావాలంటే మీ నాన్ననడుగు. నన్నడక్కు'' అన్నాను.

''ఇన్నిరకాల వంటలు కావాలని నాన్న నన్నడిగితే మిక్సీ ఆయన్నే అడిగి వుండేదాన్ని'' అంది సుజాత.

''ఆయనకు ఉత్తరం రాస్తావా? రాయవా?''

సుజాత బదులివ్వలేదు.

కానీ వారంరోజుల తరువాత నాకు మామగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఆయనకు అనుకోకుండా ఏదో వ్యాజ్యంలో కలిసొచ్చి కొంత డబ్బు వచ్చిందిట. ఒకో కూతురికి అయిదువేలు ఇద్దామని అనుకున్నార్ట. పెద్ద కూతురు పట్టుచీర కొనివ్వమంది. ఆమెకు నచ్చిన చీర కొంటే ఆరువేలయింది. మూడో కూతురికి ఆరువేలు పెట్టి పట్టుచీర కొన్నాడు. రెండ్రోజుల్లో బయల్దేరి ఇక్కడికి వస్తాడు. సుజాతకూ ఆరువేలలో పట్టుచీర కొందామని! ఆరువేలు...

నా మనసు ఉత్సాహంతో ఉరకలు వేసింది.

సుజాత తండ్రికి ఉత్తరం



వ్రాసిందా? దానికాయన ఈ విధంగా స్పందించాడా?

మొత్తం మీద తండ్రీకూతుళ్ళు గుంభన వున్నవాళ్ళు.

ఉత్తరం సుజాతకు చూపిస్తే తను పట్టుచీర కొనుక్కుంటానని మొండికేసింది. మిక్సీ తన తండ్రి కొనడానికి వీల్లేదంది.

అయితే ఆడవాళ్ళను అనగద్రొక్కడానికి అట్నించి నరుక్కురావచ్చునని నాకు తెలుసు.

సుజాత కట్నమివ్వకుండా పెళ్లి చేసుకోవాలనుకుంది. తండ్రి ఆమెకు నచ్చచెప్పి ఒప్పించాడు.

సుజాతకు అత్తగార్ని సంస్కరించాలని వుంది. తండ్రి మందలిస్తాడు.

సుజాతకు భర్తను ఎదిరించాలని వుంది. తండ్రి ఒప్పుకోడు.

సుజాతకు మిక్సీ భర్తచేతే కొనిపించాలని ఉంది. మామగారు రాగానే నేనాయనకు మొత్తం కథంతా వివరంగా చెప్పాను. ఆయన సుజాతను నా ఎదుటే మందలించి చాటుగా నచ్చజెప్పారు. అయిష్టంగానే సుజాత ఒప్పుకుంది.

ఆ రాత్రి సుజాత నాకు దూరంగా పడుకుంది.

''భార్యాభర్తల పోరాటంలో భర్తదే అంతిమ విజయం. ఆ విషయం గుర్తుంచుకుంటే నువ్విలా నాకు దూరంగా జరగవు'' అన్నాను.

''అంతిమ విజయం ఎవరిదైనా నాకు బాధలేదు. అది అధర్మానిదీ, అన్యాయానిదీ కాకుండా వుంటే చాలు'' అంది సుజాత ఉక్రోషంగా.

''అయితే నేను నీకు దుష్టుడిలాగో, ధూర్తుడిలాగో కనిపిస్తున్నానా?'' అన్నాను.

''అది నేనెందుకు చెప్పడం? అద్దముంది. చూసుకోండి'' అంది సుజాత.

''నా అద్దం అటు తిరిగితే ఎలా?' అంటూ ఆమెను నావైపు తిప్పుకున్నాను.

సుజాత ప్రతిఘటించలేదు.

''దేవుడున్నాడు. చూడండి. ఈ మిక్సీ పోరాటంలో అంతిమ విజయం నాదే'' అంది.

అప్పుడు నాకామె ముఖం చూడముచ్చటగా వుంది.

ఆమె మానసిక సంఘర్షణలో నాకు ప్రమేయంలేదుగానీ ఆమె అంటే నాకూ ఇష్టమే. ''నువ్వు నెగ్గితే నాకూ సంతోషమే'' అన్నాను దగ్గరగా తీసుకుంటూ.

''సంతోషమని ఊరుకుంటే చాలదు. నేను నెగ్గితే ఈ ఇంట్లో నా మాటకు విలువ పెరగాలి'' అంది సుజాత.

సుజాత అభిప్రాయంలో ఆ ఇల్లు సుజాతది. అందులో నేను, తను తప్ప వేరెవరి ప్రమేయమూ వుండకూడదు.

అది సబబేనని నాకు తెలుసు. కానీ ఎందుకో ఒప్పుకోలేదు. ఆమె పరాజయం ఎలాగూ తథ్యమేనని నాకు తెలుసు కాబట్టి చాలా నమ్మకంగా ''సరే'' అన్నాను.

ఆ రాత్రి ఆ తర్వాత సరదాగానే గడిచిపోయింది.

మర్నాడు సాయంత్రం నేనాఫీసునుంచి ఇంటికొచ్చేసరికి సుజాత ముఖం వెలిగిపోతోంది. టేబుల్‌మీద వున్న మిక్సీ చూసేక ఆ ముఖం ఇంకా ఎందుకు వెలుగుతుందో నాకు

వసుంధర

అర్థం కాలేదు.

''మిమ్మల్నిలా ఆఫీసుకు పంపించి నాన్న, నేనూ షాపింగ్‌కు వెళ్లాం. బట్టల షాపువైపు కన్నెత్తి కూడా చూడ కుండా మిక్సీల షాపుకి వెళ్లాం. అక్కడ ఓ కొత్త కంపెనీ మిక్సీ డిమాన్‌స్ట్రేషన్ అవుతోంది. ఇంట్రడక్టరీ ఆఫర్ రెండు వేలు. తొందరలో దీని ధర అయిదువేలు అయిపోతుంది. మనక్కావాల్సిన సదుపాయాలన్నీ ఇందులో ఉన్నాయి. కొనేశాం.''

''అంటే అయిదువేలు మిక్సీ రెండువేలకు వచ్చింది. మిగతా నాలుగువేలకూ నువ్వు పట్టుచీర కొన్నావా?'' అన్నాను.

''లేదు. ఈ మిక్సీకి మధ్యాహ్నాం లక్కీ డ్రా వుంది. డ్రాలో ఎవరి పేరు వస్తే వాళ్ళకు కొన్న డబ్బు తిరిగిచ్చేస్తారు. నాకు ధర్మం మీదా, న్యాయంమీదా నమ్మకముంది. మధ్యాహ్నాందాకా నాన్నను ఆగమన్నాను. నేనునుకున్నట్లే డ్రాలో నా పేరు వచ్చింది. రెండువేలూ తిరిగొచ్చాయి. ఇక పట్టుచీర మీరే నాకు ఎన్నికచేసి పెట్టాలి'' అంది సుజాత.

ఖంగుతిన్నాను. ఇది తప్పకుండా భామా విజయమే.

ఆ మాటే నిరుత్సాహంగా పైకి అంటే ''మీ డబ్బుతో మిక్సీ కొంటే తప్ప ఇది నా విజయం కాదు'' అని న్యాయం చెప్పింది సుజాత.

ఆమె నిజాయితీకి విలువిచ్చినా ఇప్పట్లో ఆమెకు విలువనివ్వనవసరం లేదన్న తృప్తితో వెంటనే రెడీ అయ్యాను పట్టుచీర షాపింగుకు.

సుజాతకు పట్టుచీర కొని మామగారు వెళ్లిపోయారు.

వారంరోజులపాటు వంటలో సుజాత అమ్మను మరిపించింది. తర్వాత మిక్సీ ట్రబులిచ్చింది.

''ఇంకా గ్యారంటీ పీరియడ్లోనే వుంది'' అంది సుజాత.

నేను మిక్సీని తీసుకుని షాపుకెళ్లాను.

''ఇది మా షాపులో అమ్మింది కాదు సార్. ఆ కంపెనీ వాళ్ళు అడిగితే డిమాన్‌స్ట్రేషన్ స్పేస్ ఇచ్చాం. మా ఎలక్ట్రికల్ ఇంజనీర్ సానుకూలంగా చెప్పకపోవడంవల్ల మేము వీటిని కొనలేదు. అయితే జనం బాగా విరగబడి కొన్నారా రోజున'' అన్నాడు షాపువాడు.

షాపువాడు మిక్సీ విషయంలో ఏమాత్రం రెస్పాన్సిబిలిటీ తీసుకోడని, అందుకు చట్టం కూడా వాడి పక్షాన వుంటుందని అర్థమయ్యాక ''మరి దీని రిపేర్ సంగతి ఏంటి?'' అని బ్రతిమాలుతున్నట్లుగా అడిగాను.

''పక్క సందులో గణేశ్ ఉన్నాడు సార్. చిన్న రాగితీగ ఇస్తే దాంతో ట్రాన్స్‌ఫార్మర్ చేయగల సమర్థుడు. అతగాడి షాపులో రిపేర్ గ్యారంటీ'' అన్నాడు షాపువాడు.

గణేశ్ దుకాణానికి వెళ్లాను. అతడు మిక్సీని చూసి చెక్‌చేసి అయిదొందలు తీసుకుని అప్పటి కప్పుడే బాగుచేసి ఇచ్చాడు.

ఇంటికి తీసుకుని వెళితే ఒకరోజు తరువాత సుజాత అది ఫలరసాలు తీసే పని తప్ప ఇంకేం చేయడం లేదంది.

మళ్లీ గణేశ్ దుకాణానికి వెళ్లి ఈసారి కాస్త నిష్ఠూరంగానే మాట్లాడాను.

''ఉత్తినే వచ్చిన సరుకు. అయిదొందలతో ఎంత పని చేస్తుంది?'' అంటూ గణేశ్ మిక్సీని రెండురోజులు వుంచుకుని వెయ్యి రూపాయలు వసూలు చేసాడు. ఈసారి అది కూరలు కూడా తరిగింది. మళ్లీ గణేశ్‌ని కలిసి ''వాటీజ్ దిస్?'' అన్నాను.

''ఈ కంపెనీ ఎక్కడుందో చెప్పండి. మీరడిగిన ప్రశ్నే వాళ్లకు నేనూ అడగాలనుకుంటున్నాను'' అన్నాడు గణేశ్.

గణేశ్ నా బలహీనతను పట్టేశాడు. కానీ నేను మాత్రం ఏం చేయగలను?

''నాకు గ్యారంటీ కావాలి? ఎంత తీసుకుంటావో చెప్పు'' అన్నాను.

''నాలుగువేలు.''

''అంటే ఇంతవరకూ తీసుకున్న దాంతో కలిపేకదా!'' అన్నాను అప్పటికి అదే తక్కువనిపించి.

''కాదు. ఇది అదనం. ఆ మొత్తం నాకిస్తే మీ మిక్సీకి రెండేళ్ళు గ్యారంటీ కాగితం మీద రాసిస్తాను'' అన్నాడు గణేశ్.

''ఈ ధరకు కొత్త మిక్సీయే వచ్చేది'' అన్నాను అప్రయత్నంగా.

''పోనీ మీరు దీన్ని నాకు వెయ్యి రూపాయలకు అమ్మేయండి. కొత్తది కొనుక్కోండి. అయితే ఒక విషయం. దానికి ఆర్నెల్లకంటే గ్యారంటీ వుండదు. ఆ తర్వాత నుంచి కంపెనీ కంటే నా దగ్గరే రిపేరు చౌక'' అన్నాడు గణేశ్.

ఏం చేయాలో తోచక ఇంటికి వెళ్లి సుజాతను సలహా అడిగాను.

''మీ అమ్మగారిని అడగండి'' అంది సుజాత నిర్లిప్తంగా.

అమ్మకు ఉత్తరం రాశాను.

అమ్మ వెంటనే జవాబు రాసింది. వయసులో వున్న సుజాత తన పనులు తనే చేసుకోవాలనీ, ఇప్పట్నించీ మిక్సీ మీద అంత డబ్బు తగలెట్టవద్దని రాసింది. తనకు ఇంటి ఖర్చులకి రెండువేలు అవసరమని కూడా వ్రాసింది.

సుజాతకు ఆ ఉత్తరం చూపించాను- అమ్మ సందేశం అర్థం చేసుకుంటుందని.

అప్పుడు సుజాత నాకో పేపరు కటింగ్ అందించింది.

అందులో ఓ వార్త. కొందరు తాత్కాలికంగా పనిచేసే పరికరాలు తయారుచేసి పెద్ద పెద్ద షాపుల్లో ప్రవేశించి ఆకర్షణీయమైన పథకాలతో జనాలను మోసగించి వాటిని అమ్ముకుని వెంటనే మాయమవుతున్నారు. అదో ముఠా. ఆ ముఠాలో పెద్దషాపులకు సంబంధం లేదని అనలేముగానీ రుజువు చేయడం కష్టం. కొన్ని మరమ్మతు దుకాణాలకీ దీంతో సంబంధముందని పోలీసులు అనుమానిస్తున్నారు.

''ఇదన్నమాట కథ. నువ్వు మీ నాన్న తెలివితక్కువగా టోపీలోపడి నన్ను ఇరికించారు'' అన్నాను వెంటనే.

''మనం ముగ్గురం టోపీలు పడ్డ మాట నిజం. ఆ పెద్ద షాపుకీ, మిక్సీ కంపెనీకి, గణేశ్‌కీ కుమ్మక్కుందనడంలో సందేహంలేదు. అయితే మన ముగ్గురి టోపీ విషయంలో మీ అమ్మగారికీ, గణేశ్‌కీ నాకు తేడా తెలియడంలేదు'' అంది సుజాత.

ఆ క్షణంలో నాక్కోపం వచ్చింది. కానీ ఆలోచిస్తే-

అక్కలకు పెళ్లిళ్ళయిపోయాయి. నాన్నగారింకా సర్వీసులో వున్నారు. ఎక్కడా అప్పులు లేవు. పొలాలమీద నుంచి ధాన్యం వస్తుంది. ఇళ్లద్దెలు వస్తాయి. పెళ్లికి తీసుకున్న కట్నం, లాంఛనాలు...ఏవీ నాకు దక్కలేదు. మరింక వాళ్ళకు డబ్బు అవసరం ఏమిటి?

పొదుపు నాకు- ఖర్చు వాళ్లకోసం- ఇదీ అమ్మ ఉత్తరం.

''మిక్సీ లేనిదే నావల్ల ఈ పనులేమీ కావని మీ అమ్మగారికి తెలుసు. అది కొనద్దన్నారంటే మిమ్మల్నావిడ రుచులూ, అభిరుచులూ మార్చుకోమంటున్నారు. చిన్నప్పుడు మీకేం వండి పెట్టారో- దూరంగా వుంటే ఆవిడకు మీకంటే నేను కష్టపడడమే ముఖ్యం'' అంది సుజాత.

''మిక్సీ కొనేస్తాను'' అన్నాను ఉక్రోషంగా.

''అత్తయ్య వద్దన్నారు. మీరు మిక్సీ కొనకండి. నా మాటకు విలువిచ్చి మీ అభిరుచులను మార్చుకోండి. ఆ విధంగా మీరు ఎవరి మనసూ నొప్పించినట్లు కాదు. ఒకటి రెండు నెలల్లో మీకు నా పద్ధతి నచ్చకపోతే అడగండి. జీవితంలో తిండి ముఖ్యం. కానీ తిండే ముఖ్యం కాదు'' అంది సుజాత.

నేను వింటున్నాను.

నా ఇంట్లో భామా విజయం ప్రారంభమైందని నాకు అర్థమైంది.

ఆడది స్వార్థపరురాలనీ, ఆమె కొడుకును తల్లిదండ్రుల నుంచి వేరు చేస్తుందనీ చాలామంది అంటారు. కానీ తనవారందర్నీ విడిచివచ్చి కేవలం భర్త సుఖమే ధ్యేయంగా ఉండే ఆడది ఏమాత్రం స్వార్థం చూపినా అది మరో ఆడదాని స్వార్థం నుంచి భర్తను రక్షించడానికే అంటే సంప్రదాయవాదులు అంగీకరించరు. ఎందుకంటే వారి దృష్టిలో భార్యే తప్ప తల్లి ఆడది కాదు మరి- స్వార్థం దృష్ట్యా చూస్తే!

నా వంటి భర్తలు నాకులా భామా విజయానికి లోబడడానికి కారణం మాత్రం నాకిప్పుడర్థమవుతోంది- అది నావంటి భర్తల స్వార్థం!

☆

అదేంటోనోయ్ నువ్వు డ్రైవ్ చేస్తుంటే ప్రాణం గాల్లో తేలిపోతున్నట్లుగా వుంటుంది.

